

దయచేసి రక్షణ కల్పించండి..

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



ప్రచురణ : హైదరాబాద్, గురువారం 15-2-2024 సంపుటి :01 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ సంచిక : 144 పేజీలు : 4 వెల : 5-00




## రాజ్యసభకు సోనియా.. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక?

3లో




## బండ్ల గణేష్ కు ఏడాది జైలు శిక్ష

- చెక్ బౌన్స్ కేసులో కీలకతీర్పు

### హామీల అమలుపై

# చర్చ జరగాలి

- ఆరు గ్యారంటీల అమలుకు రూ.2.15 లక్షల కోట్లు కావాలి: అక్బరుద్దీన్
- 6 గ్యారంటీలు, 5 డిక్లరేషన్లు, 300 హామీలెలా అమలు చేస్తారు?
- గ్యారంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- నిధులు ఎలా సమకూరుస్తారో చెప్పాలి
- పాతబస్తీలో రంజాన్‌కు నీరు ఇవ్వాలి
- శాసనసభలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్



హైదరాబాద్: **జర్నలిస్ట్ వార్త** ఆరు గ్యారంటీల అమ లుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పథకాల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఈ పథకాలకు నిధులు ఏ విధంగా సమకూరుస్తారో ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉంది'అని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై శాసనసభలో బుధవారం జరిగిన చర్చలో అక్బరుద్దీన్ మాట్లాడుతూ ఇప్పటికే రెండు పథకాలు అమలు చేయడం అభినందనీ యమేనన్నారు. మిగతా నాలుగు పథకాలు వందరో జుల్లో అమలు చేయాలని చెప్పారు. ఈ ఆరు పథకాలకు బడ్జెట్‌లో రూ.53, 196 కోట్లు కేటాయించారు..రాష్ట్ర ఆర్థిక రాబడి రూ. 2,74,185.7 కోట్లు, ఖర్చు 2,75,890.69 కోట్లుగా బడ్జెట్‌లో అంచనా వేశారు. రాష్ట్ర రాబడులు, అప్పులకు చెల్లించే వడ్డీలు, నెలవారీ చెల్లింపులకు మధ్య పొంతన కుదరడం లేదని చెప్పారు.

# మరో 10 ఏళ్లు అధికారంలో ఉంటా




, **హైదరాబాద్: జర్నలిస్ట్ వార్త** ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ వస్తే 22 నెలలుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు.నూతనంగా నియమించబడిన పోలీసు కానిస్టేబుల్స్‌కు నియామక పత్రాలు జారీచేసే కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 'టీఎస్‌పీఎస్సీని ప్రక్షాలన చేశాం. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం.. ప్రజల సమస్యలను పరిష్కరిస్తుంది. రాబోయే రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత మాది. బీఆర్ఎస్ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగింది. పదేళ్లు అధికారంలో ఉంటూ.. ప్రజలు ఆమోదిస్తే మరో 10 ఏళ్లుగా అధికారంలో ఉంటాం. అసెంబ్లీలో చర్చకు రమ్మంటే కేసీఆర్ రారు. కానీ.. నల్గొండలో సభకు మాత్రం కేసీఆర్ వెళ్లారు. అసెంబ్లీ రానివారికి అధికారం ఎందుకు? ఇంటికే నియామక పత్రాలు పంపొచ్చు కదా అని హరీశ్‌రావు అంటున్నారు. కేసీఆర్.. తన బంధువులకు అనే పదవులు కట్టబెట్టారు' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.




## భారత్ లో ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారు

- బీజేపీ నిబద్ధతపై ప్రజలకు నమ్మకం ఉంది
- ప్రపంచ ప్రభుత్వ సదస్సులో మోడీ కీలకోపన్యాసం
- యూఏఈలో రెండోరోజు మోడీ పర్యటన

# రైతులపై కక్ష పెంచుకోవద్దు..

- కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒక్కటే కాదు
- కాళేశ్వరం వల్లే ఎర్రటి ఎండల్లోనూ ఎల్ఎండీ, ఎంఎండీలో నీళ్లు
- శ్రీధర్‌బాబు, పొన్నంకు కూడా ఇది తెలుసు
- సభ్యులందరినీ స్పీకర్ ఒకేలా చూడాలి
- దళితనేత కడియంపై రాజగోపాల్ వ్యాఖ్యలు దారుణం
- శాసనసభలో మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 14**జర్నలిస్ట్ వార్త** కేసీఆర్‌పై కోపంతో రైతులపై కక్ష పెంచుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్క బరాజ్‌లో మూడునా లుగు పిల్లర్లకు ఇబ్బంది కలిగితే వాటిని రిపేర్ చేసి రైతులుకు సాగునీరు అందించాలని కోరారు. రాజకీయం కోసం కేసీఆర్‌పై కోపం పెంచుకున్నా రైతులపై మాత్రం కక్షగట్టొద్దని హితవు పలికారు. ప్రస్తుతం 5 వేల క్యూసెక్కుల నీళ్లు కిందికి పోతున్నాయని, మేడిగడ్డ నింపి కాళేశ్వరం పంపింగ్ మొదలు పెట్టాలని కోరారు. బుధవారం కేటీఆర్ శాసనసభలో మాట్లాడుతూ ప్రభుత్వానికి ఈ విజ్ఞప్తి చేశారు.ఎల్ఎండీ, ఎంఎండీ, సింగూరు, ఎస్సారెస్పీ అన్నీ కాళేశ్వరం పుణ్యమే కాళేశ్వరం ద్వారా కొత్తగా 97 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, కానీ స్థిరీకరించిన ఆయకట్టు ఎంతని అడిగితే మాత్రం సమాధానం లేదని పేర్కొన్నారు. ఎర్రటి ఎండల్లోనూ అప్పర్ మానేరు, మిడ్‌మానేరు నీళ్లతో నిండిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు కూడా ఈ విషయం తెలుసని పేర్కొన్నారు. గౌరవెల్లి, మలక్‌పేట్ రిజర్వాయర్, అప్పర్ మానేరు, స్థిరీకరించబడిన సింగూరు, నిజాంసాగర్, ఎస్సారెస్పీ పునరుజ్జీవం అయినా ఇవన్నీ కాళేశ్వరం ద్వారా జరిగిన మాట వాస్తవమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇలాంటి వాస్తవాల గురించి ప్రజలకు చెప్పాలని కోరారు.

**పొన్నం, నేను కలిసి పనిచేశాం**

పొన్నం ప్రభాకర్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, ఆయన ఎంపీగా, తాను ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచి 2009 నుంచి కలిసి పని చేశామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ కోసం వీరోచితంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రిని అవమానించే కుసంస్కారం తనకు లేదని తెలిపారు. కానీ, ఆయన వాస్తవ విరుద్ధ మాటలు చెప్తుంటే తట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

# సచ్చిన పామును మళ్లీ చంపుతారా?



అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

సీఎంను పట్టుకుని ఏం పీకడానికి మేడిగడ్డకు వెళ్లారని అంటారా?

మేడిగడ్డ మేడిపండు మాదిరిగా కుంగిపోతే, అక్కడ నీళ్లు నింపే అవకాశముందా?

కేసీఆర్, హరీశ్‌రావులకే బాధ్యతలు అప్పగిస్తామన్న ముఖ్యమంత్రి

మేడిగడ్డలో నీళ్లు నింపి అన్నారం, సుందిళ్లలో పోసే బాధ్యత తీసుకోవాలని వ్యాఖ్య



హైదరాబాద్, **జర్నలిస్ట్ వార్త** కాళేశ్వరం దోపిడీ బయటపడు తుందని, జైలుకు వెళ్లాల్సి వస్తుందనే కేసీఆర్‌ను చంపుతారా అంటూ మాట్లాడుతున్నారని, ఆయనను చంపాల్సిన అవసరం ఎవరికి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్ని చారు. 'ఇప్పటికే సచ్చిన పామును మళ్లీ ఎవరైనా చంపుతారా? మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఆ పామును చేతితో కాదు కట్టెతో కొట్టారు. ఆల్రెడీ చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేం ఉంది?' అని వ్యాఖ్యానించారు.సానుభూతి కోసం కేసీఆర్ వీల్‌చైర్, వీధినాటకాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై సభలో చ ర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చేలా ఆ పార్టీ ఎమ్మెల్యేలు చూడాలన్నారు. బుధవారం అసెంబ్లీలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య బడ్జెట్‌పై వాదోపవాదాలు జరుగుతుండగా సీఎం జోక్యం చేసుకుని మాట్లాడారు.

**కేసీఆర్‌ను సభకు రమ్మనండి**

'సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో శ్వేతపత్రం ప్ర వేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేసీఆర్ పారిపోయి ఫామ్‌హౌస్‌లో పడుకుని, అక్కడెక్కడి కో పోయి ప్రగల్భాలు ఎందుకు? సభకు రమ్మనండి..వాస్తవాలపై చర్చిద్దాం..అన్ని అంశాలపై మాట్లా డదాం. అలా కాదు కాళేశ్వరంపైనే చర్చిద్దామంటే అందుకు కూడా స్పీకర్ విడిగా సమయం కేటాయి స్తే చర్చకు సిద్ధం.మేడిగడ్డ మేడిపండు మాదిరిగా కుంగిపోతే, అక్కడ నీళ్లు నింపే అవకాశముందా? కేసీఆర్, హరీశ్‌రావు సాగునీటి శాఖ మంత్రులుగా పనిచేశారు కదా.. వారికే బాధ్యతలు అప్పగిస్తాం..వారే ఎలా మేడిగడ్డలో నీళ్లు నింపి అక్కడి నుంచి అన్నారం, సుందిళ్లలో పోస్తారో బాధ్యత తీసుకోవాలి..' అని రేవంత్ అన్నారు.

జర్నలిస్ట్ వార్త
RNI NO :Title-Code :-TELTEL02102
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

# ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యంగా బెదిరింపులు

## ఓ వ్యక్తి ప్రధానిని హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14
తన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ, రైతులు ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. పంటకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో పాటు రైతులకు, రైతు కూలీలకు ఫించన్లు, లఖీంపూర్ ఖేరీ బాధితులకు ఆర్థిక సాయం వంటి పలు రకాల డిమాండ్లతో 'ఢిల్లీ చలో' మార్చ్‌కి బయలుదేరారు. ఇదిలా ఉంటే, వీరిని అడ్డుకునేందుకు పోలీసులు, కేంద్ర బలగాలు హర్యానా-ఢిల్లీ సరిహద్దుల్లో మోహరించాయి. నిన్నటి నుంచి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్‌లను పోలీసులు ప్రయోగించి వారిని అడ్డుకుంటున్నారు. ఇదిలా ఉంటే తాజాగా రైతుల ఆందోళనలో పాల్గొంటున్న పలువురు వ్యక్తులు ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఓ వ్యక్తి ప్రధానిని హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదమయ్యాయి. "గతంలో పంజాబ్ వచ్చిన సమయంలో ప్రధాని మోడీ తప్పించుకున్నారని, ఈ సారి పంజాబ్ వస్తే అతడిని ఎవరూ రక్షించలేరు" అంటూ చేసి వ్యాఖ్యల వైరల్ అయ్యాయి. 2022, జనవరి నెలలో ప్రధాని మోడీ పంజాబ్ పర్యటన సమయంలో ఫిరోజ్‌పూర్ వద్ద భద్రత ఉల్లంఘన జరిగింది. ఓ ఫ్లై ఓవర్‌పై కొన్ని నిమిషాల వరకు ఆయన కాన్వాయ్ అక్కడి నిలిచిపోయింది. పంజాబ్ పోలీసులు సరైన భద్రత కల్పించలేకపోవడంతో నిరసనకారులు ప్రధాని కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. ఈ ఘటనలో ఆరుగురు పంజాబ్ పోలీసులను సస్పెండ్ చేశారు. రైతులు మొత్తం 12 డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. రైతు సంఘం నాయకులు జగ్జీత్ సింగ్ దల్వాల్ మరియు సర్వన్ సింగ్ పంధేర్ నేతృత్వంలోని సంయుక్త కిసాన్ మోర్చా, పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పిలుపునిచ్చాయి. స్వామినాథన్ కమిషన్ నివేదికలో పేర్కొన్న విధంగా అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) హామీ చట్టం తేవాలని డిమాండ్ చేస్తున్నారు. పూర్తి రుణమాఫీ చేయాలని, రైతులకు, రైతు కూలీలకు పింఛన్లు అందించే పథకాన్ని కూడా డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు చేయాలని రైతులు కోరారు మరియు 2013 భూసేకరణ చట్టాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 (ఎంజిఎన్ఆర్ఇజిఏ) కింద సంవత్సరానికి 200 రోజుల ఉపాధి మరియు రూ. 700 రోజువారీ వేతనం అందించాలని, వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కూడా రైతులు విజ్ఞప్తి చేశారు.



# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ నోటీసులు



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఫిబ్రవరి 19న తమ ఎదుట విచారణకు హాజరు కావాలని తెలిపింది.కాగా కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడం ఇది ఆరోసారి. గతంలో కేజ్రీవాల్‌కు ఈడీ అయిదుసార్లు సమన్లు జారీ చేసింది. ప్రతిసారి ఆయన విచారణకు హాజరు కాలేదు.తాజాగా సోమవారం(ఫిబ్రవరి 19న) విచారణకు హాజరు కావాలని బుధవారం మరోసారి ఈడీ సమన్లు పంపింది. మరి ఈసారైనా కేజ్రీవాల్ ఈడీ విచారణకు హాజరవుతారో లేదో వేచిచూడాలి. ఈడీ నోటీసులను అక్రమమని, చట్టవిరుద్ధమ ఢిల్లీ సీఎం పేర్కొన్నారు. ఈడీ సమన్ల ద్వారా తనను లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.అయితే ఈడీ పదేపదే నోటీసులు జారీ చేయడం వెనక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపిస్తుంది. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమని, దీని ద్వారా ఢిల్లీ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారని విమర్శలు గుప్పించింది. అది ఎప్పటికీ జరగకుండా చూస్తామని తెలిపింది. కాగా గతంలో నవంబర్ 1న తొలిసారి ఢిల్లీ సీఎంకు ఈడీ సమన్లు జారీ చేసింది. తరువాత డిసెంబర్ 21, ఈ ఏడాది జనవరి 3, జనవరి 18, ఫిబ్రవరిన హాజరు కావాలని నోటీసులు ఇవ్వగా.. సీఎం అరవింద్ కేజ్రీవాల్ వాటిని భేఖతారు చేశారు.

## ఇద్దరు రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన ఏఐసీసీ



ఢిల్లీ: తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభ అభ్యర్థులను బుధవారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ప్రకటించింది. రేణుక చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్‌కు ఏఐసీసీ అవకాశం ఇచ్చింది.
మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తనయుడే అనిల్ కుమార్ యాదవ్. దీంతో పెద్దల సభలోకి యువకుడు అనిల్ కుమార్ యాదవ్ అడుగుబెట్టనున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అనిల్ కుమార్ యాదవ్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. యూత్ కాంగ్రెస్ కోటాలో అనిల్‌కు అవకాశం కల్పించింది కాంగ్రెస్ అధిష్టానం.ఇక.. అజయ్ మాకెన్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, చంద్రశేఖర్‌లను రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ కర్ణాటక నుంచి ఎంపిక చేసింది. మధ్య ప్రదేశ్ నుంచి అశోక్‌సింగ్‌ను ఏఐసీసీ ఎంపిక చేసింది. వీరంతా రేపు(గురువారం) నామినేషన్ వేయనున్నారు.

**రేణుకా చౌదరీ ఎవరి కోటా.?**

తెలంగాణ నుంచి కాంగ్రెస్ ఎంపిక చేసిన రేణుకా చౌదరీ పేరు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. విశాఖలో పుట్టిపెరిగిన రేణుకా చౌదరీ.. బెంగళూరులో చదువుకున్నారు. 1984లో తెలుగుదేశం పార్టీలో చేరి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. 1986 నుంచి 1998 వరకు తెలుగుదేశం పార్టీ చీఫ్ విప్‌గా పని చేశారు. కేంద్ర మంత్రిగా కూడా పని చేశారు. 1998లో టిడిపిని వీడి కాంగ్రెస్‌లో చేరిన రేణుకా ఖమ్మం నుంచి వరుసగా రెండు సార్లు ఎంపీగా గెలిచారు. వివాదస్పద ప్రకటనలు చేసి తరచుగా వార్తల్లోకెక్కే రేణుకా చౌదరీ మరోసారి రాజ్యసభకు వెళ్లనున్నారు.

**అనిల్ కుమార్ యాదవ్ పేరు ఆశ్చర్యమే.!**

తెలంగాణ నుంచి తనను రాజ్యసభ? అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానికి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటన వెలువడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నాలాంటి యువకుడికి అధిష్ఠానం రాజ్యసభ అవకాశం ఇవ్వడం అనందంగా ఉంది. కష్టపడే వారికి కాంగ్రెస్‌లో పదవులు దక్కుతాయి అనడానికి ఇదే ఉదాహరణ. నాకు పదవి ఇవ్వడం అంటే యూత్ కాంగ్రెస్ కార్యకర్తల కృషి గుర్తించినట్టు.!. బీసీల తరపున కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు. కొత్త రక్తాన్ని రాజకీయాల్లోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యం. బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ, నాకు రాజ్యసభ ఇవ్వడంతో కాంగ్రెస్ యువతకు ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. రాజ్యసభ అవకాశం ఇస్తారని.. నా జీవితంలో ఊహించలేదు" అని అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు.

## భారతీయ కుటుంబం అనుమానాస్పద మృతి

శాన్‌మాంటియో,ఫిబ్రవరి14 అమెరికాలో ఓ భారతీయ జంట, వారి కవల పిల్లలు అనుమానాస్పదరీతిలో మృతి చెందారు. శాన్‌మాంటియోలో మంగళవారం ఈ విషాదం చోటుచేసుకుంది. మృతి చెందిన దంపతులను ఆనంద్ సుజిత్ హెన్రీ(42), అలైస్ బెంజైగర్ ఉరఫ్ ప్రియాంక(40), వారి కవల పిల్లలు నోవా, నాథన్(4)గా గుర్తించారు. ఆనంద్ కుటుంబానిది కేరళలోని కొల్లం కాగా కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు.విగతజీవులైన ఆనంద్ ఇద్దరు కొడుకులను వారి బెడ్‌రూంలో, ఆనంద్, ఆయన భార్య మృతదేహాలను బాత్రూంలో గుర్తించారు.

## శాసనసభ బీజేపీ పక్షనేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో బీజేపీ నేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు.మహేశ్వర్‌రెడ్డిని బీజేపీఎల్‌పీ నేతగా నియమిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.శాసనసభ పక్ష ఉపనేతలుగా పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి నియామకం అయ్యారు. శాసనమండలి పక్షనేతగా ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని నియామకం అయ్యారు.కాగా మహేశ్వర్ రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన విదితమే. 2009లో ప్రజారాజ్యం తరపున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన. 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందే మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు.
ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించించగా ఇందులో గోషామహల్ నుంచి రాజాసింగ్ హ్యాట్రిక్ విజయం సాధించారు. ఆదిలాబాద్ నుంచి పాయల్ శంకర్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి పాల్వాయి హరీష్‌బాబు, నిర్మల్ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ నుంచి రామారావు పటేల్, నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ నుంచి రాకేశ్ రెడ్డి, కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి గెలిచారు. ఇందులో రాజాసింగ్, మహేశ్వర్ రెడ్డి మినహా మిగతా వారందరూ తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారే.

## రాజ్యసభకు సోనియా.. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక?

పార్టీ సంక్షోభంలో ఉన్నప్పుడు పగ్గాలు చేపట్టారు.. పార్టీని రెండుసార్లు అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు..యూపీఏ ఛైర్‌పర్సన్‌గా కూటమికి పెద్దగా వ్యవహరించారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయాల్లో తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో హుందాగా వ్యవహరించారు. ఆమే సోనియా గాంధీ దాదాపు 25 ఏళ్ల పాటు వరుసగా లోక్‌సభ సభ్యురాలిగా వ్యవహరించిన ఆమె.. త్వరలో రాజ్యసభలో అడుగుపెట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు తీసుకున్న ఈ నిర్ణయంతో రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం గురించి సర్వత్రా చర్చ మొదలైంది.
రాజస్థాన్ నుంచి ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. అందులో ఒకటి కాంగ్రెస్‌కు దక్కనుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఈ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. ఈ స్థానం నుంచి సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లనున్నారు. తాజాగా బుధవారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో రాహుల్, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. గాంధీ కుటుంబం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యే రెండో నేతగా సోనియా నిలవబోతున్నారు. 1964 ఆగస్టు నుంచి 1967 ఫిబ్రవరి వరకూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ.. పెద్దల సభ సభ్యురాలిగా ఉన్నారు.

## రాజకీయ ప్రలోభాలకు లోనుకావొద్దు: రైతు సంఘాలకు కేంద్రం హితవు



ఢిల్లీ, ఢిల్లీ ఛలో పేరిట ఆందోళనలను తీవ్రతరం చేయాలని రైతు సంఘాలు భావిస్తున్న తరుణంలో కేంద్రం స్పందించింది. మరోసారి చర్చలకు రావాలని రైతు సంఘాల్ని ఆహ్వానించింది.తమతో కేంద్రం అవలంభిస్తున్న వైఖరికి నిరసనగా.. ఈ నెల 16వ తేదీన భారత్ బంద్‌కు కిసాన్ మోర్చా పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే..భారత్ బంద్ ప్రకటించిన కాసేపటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా మీడియాతో మాట్లాడారు. "చర్చల ద్వారా రైతు సంఘాలు సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలి. అంతేగానీ.. రాజకీయ పార్టీల ప్రలోభాలకు రైతు సంఘాలు గురి కావొద్దు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని గుర్తించాలి" అని కోరారాయన.అలాగే.. రైతుల మార్చ్ నేపథ్యంలో దేశ రాజధాని ప్రాంతంలో.. శివారుల్లో భారీగా ట్రాఫిక్ ఝూమ్ ఏర్పడుతోంది. ఈ పరిణామంపైనా మంత్రి అర్జున్ ముండా స్పందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని రైతుల్ని కోరారాయన. మరోవైపు చర్చల పిలుపుపై రైతు సంఘాలు స్పందించాల్సి ఉంది.ఇదిలా ఉంటే.. ఢిల్లీ సరిహద్దులో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిన్నటి నుంచే పంజాబ్, హర్యానా, యూపీ నుంచి ఢిల్లీ వెళ్లే సరిహద్దులోనే ఉండిపోయారు. మంగళవారం ఉదయం నుంచే ఢిల్లీ వైపు వెళ్లేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఢిల్లీకి రెండు వంద కిలోమీటర్ల పరిధిలోనే వాళ్లను నిలువరించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. సరిహద్దులో బారికేడ్లు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేసి అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది.

## కాంగ్రెస్‌కు విభాకర్ శాస్త్రి గుడ్‌బై

ఉత్తరప్రదేశ్,ఫిబ్రవరి14 సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ముఖ్య నేతలు పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే ఇండియా కూటమి బలహీనపడుతున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ లీడర్లు కూడా వెళ్లిపోవడం పార్టీని కలవరపెడుతోంది.
మహారాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి అశోక్‌చవాన్ ఇటీవల కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరి రాజ్యసభ సీటు సంపాదిం చుకున్నారు. అదే బాటలో మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి మనవడు విభాకర్ శాస్త్రి కూడా చేరారు. తాజాగా ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేసి బీజేపీ లో చేరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విటర్)లో తెలియజేశారు.
కాంగ్రెస్‌కు రాజీనామా అనంతరం విభాకర్ శాస్త్రి బీజేపీలో చేరారు. ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశానికి తవంతు కృషి చేస్తానని విభాకర్ తెలిపారు.

## పుతిన్ వెనక్కితగ్గితే హత్యచేస్తారు

ఉక్రెయిన్‌తో యుద్ధంలో పుతిన్ ఓడిపోడుఎల్లన్ మస్క్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 టెస్లా కంపెనీ ఓనర్ ఎల్లన్ మస్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రష్యా, ఉక్రెయిన్ యుద్దంలో ఒక వేళ ఉక్రయిన్ యుద్దం నుంచి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెనక్కి తగ్గితే, అప్పుడు అతన్ని హత్య చేసినా ఆశ్చర్యంలేదన్నారు. సోమవారం ఓ సభలో ఎల్లన్ మాస్క్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పుతిన్ ఓడిపోడు అని ఎల్లన్ మాస్క్ స్పష్టం చేశారు. యుద్ధంతో సతమతం అవుతున్న ఉక్రెయిన్‌కు మరింత సహాయాన్ని అందించడానికి అమెరికా సేనేట్‌లో బిల్లు పెట్టిన నేపథ్యంలో మస్క్ ఆ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వార్‌లో పుతిన్ ఓడిపోరన్న అభిప్రాయాలను మస్క్ సమర్తించారు. ఉక్రెయిన్ గెలుస్తుందనే కల్పిత ప్రపంచంలో ఉండవద్దని పేర్కొన్నారు. బిల్లుకు మద్దతు ఇవ్వడం అంటే.. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని పొడిగించడమే అవుతుందన్నారు ఎల్లన్ మాస్క్. యుద్ధాన్ని కొనసాగించాలన్న వత్తిడి పుతిన్‌పై ఉందన్నారు. ఒకవేళ ఆయన వెనక్కి తగ్గితే, అప్పుడు ఆయన్ను హతమారుస్తారని మస్క్ పేర్కొన్నారు. 95 బిలియన్ల డాలర్ల సాయాన్ని అందించేందుకు అమెరికా సేనేట్‌లో బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. ఉక్రెయిన్, రష్యా దేశాల మరణాలు రెండు వైపులా ఆగాలని ఆశిస్తున్నట్లు మస్క్ తెలిపారు. ఒకవేళ రష్యాలో ప్రభుత్వం మారాలని భావిస్తే, అప్పుడు దానికి తగిన వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. కానీ ఆ వ్యక్తి పుతిన్ కన్నా కఠిన వ్యక్తే అయి ఉంటాడని ఆయన పేర్కొన్నారు.


## భారత్ లో ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారు

బీజేపీ నిబద్ధతపై ప్రజలకు నమ్మకం ఉంది
ప్రపంచ ప్రభుత్వ సదస్సులో మోడీ కీలకోపన్యాసం
యూఏఈలో రెండోరోజు మోడీ పర్యటన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 ప్రపంచానికి పచ్చని , స్వచ్ఛమైన , సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ప్రభుత్వాలు అవసరమని ప్రధాని మోడీ ఆకాంక్షించారు. యూఏఈలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా బుధవారం రెండోరోజు మోడీ పర్యటన కొనసాగుతోంది. దుబాయ్‌లో జరిగిన ప్రపంచ ప్రభుత్వ సదస్సులో మోడీ ప్రసంగించారు. ప్రపంచానికి స్వచ్ఛమైన, ఆకుపచ్చ మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ప్రభుత్వాలు అవసరమని మోడీ నొక్కి చెప్పారు.అలాగే ప్రపంచానికి అంటువ్యాధులు లేని ప్రభుత్వాలు అవసరమని స్పష్టం చేశారు. భారతదేశంలోని ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారని చెప్పుకొచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పెరిగిందని.. బీజేపీ యొక్క ఉద్దేశం.. నిబద్ధతపై ప్రజలకు నమ్మకం ఉందని తెలిపారు. పాలనలో ప్రజల మనోభావాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే ఇది సాధ్యమైందని మోడీ పేర్కొన్నారు. రెండురోజుల పర్యటన నిమిత్తం మోడీ మంగళవారం యూఏఈలోని అబుదాబికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో మోడీకి ఘనస్వాగతం లభించింది. అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్షించారు. అలాగే ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. భారతీయులు-యూఏఈతో మంచి సంబంధాలు కోరుకుంటున్నారని మోడీ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ఈ రోజు అబుదాబిలో నిర్మించిన తొలి హిందూ దేవాలయాన్ని మోడీ ప్రారంభించనున్నారు.

## బండ్ల గణేష్ కు ఏడాది జైలు శిక్ష

– చెక్ బౌన్స్ కేసులో కీలకతీర్పు



ఒంగోలు,ఫిబ్రవరి14 చెక్ బౌన్స్ కేసులో ఒంగోలు కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. సినీ నిర్మాత, కాంగ్రెస్ నేత బండ్ల గణేష్ కు ఏడాది జైలు శిక్ష విధించింది. ఒంగోలు రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో చెక్ బౌన్స్ కేసు విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనల తర్వాత న్యాయమూర్తి తీర్పును వెలువరించారు.బండ్ల గణేష్ కు ఏడాది జైలు శిక్ష విధించారు. రూ. 95 లక్షల జరిమానా కూడా విధించారు. కోర్టులో విచారణకు బండ్ల గణేష్ స్వయంగా హాజరయ్యారు. తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు న్యాయస్థానం నెలరోజుల గడువు కూడా ఇచ్చింది. ముప్పాళ్ల గ్రామానికి చెందిన జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద 2019లో బండ్ల గణేష్ రూ. 95 లక్షలు తీసుకున్నారు. సదరు వ్యక్తికి పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్ పేరుతో బండ్ల గణేష్ చెక్కు ఇచ్చారు. అయితే ఈ చెక్ బౌన్స్ అయ్యింది. ఈ నేపథ్యంలో జెట్టి వెంకటేశ్వర్లు .. బండ్ల గణేష్ పై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కోర్టును ఆశ్రయించారు. ఈ చెక్ బౌన్స్ కేసుపై ఒంగోలు రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ చేపట్టారు.

## మేడారం భక్తుల సౌకర్యార్థం ఇసుక లారీ రవాణా నిలిపివేయాలి

**- ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు దబ్బకట్ల సుమన్**

తాడ్వాయి, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సమయం సమీపిస్తుంది. బుధవారం ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు దెబ్బకట్ల సుమన్ ఇసుక రవాణా చేస్తున్న లారీలను తక్షణమే నిలిపివేయాలని భక్తుల సౌకర్యార్థం వారు ఓ ప్రకటన ద్వారా కోరారు. మాఘ శుద్ధ పౌర్ణమి ఈ నెల 21, 22, 23, 24 తేదీలలో మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లుల మహాజాతర ప్రారంభం కానుందన్నారు. జాతర ప్రారంభానికి నెల రోజుల ముందే ప్రతి రోజు భక్తులు లక్షలాది మంది ఆ తల్లులను దర్శించుకుని వెళ్తుంటారు. ఛత్తీస్ ఘడ్, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, జార?ండ్ వివిధ రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో నలుమూలల నుండి భక్తులు ఆర్.టి.సి బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో, కార్లలోనూ ప్రయాణిస్తూ జాతర సమీపానికి చేరుకుంటారు. గోదావరి పరివాహకమైన మేడారం చుట్టుపక్కల ఇసుక లారీలు అధికంగా తిరుగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మేడారానికి 50 నుండి 75 కిలో మీటర్ల పరిధిలో ఉన్న నర్సంపేట, ములుగు, పస్ర, తాడ్వాయి, ఏటూరు నాగారం, వాజేడు, వెంకటపురం, కరకగూడెం, పినపాక, మణుగూరు వరకు అన్ని ప్రధాన రహదారులు ఇసుక లారీలతో రద్దీగా అనునిత్యం తిరుగుతుండడంతో భక్తులకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. కొన్నిచోట్ల ఇసుక లారీల రవాణ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఇతరత్రా వాహనాల ద్వారా మేడారం జాతర సమీపాన్ని చేరుకునే క్రమంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా..? అనే అనుమానంతో భక్తులు ప్రయాణం చేసే దుస్థితి ఏర్పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. రోజురోజుకు భక్తుల, వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుందన్నారు. తక్షణమే భక్తుల పరిరక్షణ కొరకు ఇసుక లారీల రవాణా జిల్లాల వారీగా కలెక్టర్లు దృష్టి పెట్టి జాతర వేడుకల్లో భాగంగా భక్తుల సురక్షిత ప్రయాణం కోసం తక్షణమే ఇసుక లారీలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. వారి వెంట అల్లెం కోటి, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి మధు, తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఉన్నారు.

## రంగాపురం గ్రామంలో మహిళలకు చీరలు పంపిణీ



కొడకండ్ల, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి యశస్విని రాజా రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం బుధవారం కొడకండ్ల మండలం రంగాపురం గ్రామంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేసిన సందర్భంగా గ్రామంలోని మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల యువజన కాంగ్రెస్ అధ్య క్షులు దూదిమెట్ల యాకేష్ యాదవ్, పెద్దవంగర మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీసు హరికృష్ణ గౌడ్, రంగాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు సోమరపు ఐల య్య, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వర్ధన్నపేట ఏసీపీ భాధ్యతలు చేపట్టిన నర్సయ్య




వర్ధన్నపేట, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బుధవారం వర్ధన్నపేట డివిజన్ ఏసీపీగా ఏ. నర్సయ్య భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన భాధ్యతలు చేపట్టడానికి వచ్చిన వారికి వర్ధన్నపేట డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది వారిని కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

**- ఏడుగురు ఆటగాళ్లపై కేసు నమోదు**



ఐనవోలు, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలం ఉడుత గూడెం గ్రామ శివారులో పేకాట స్థావరాలపై బుధవారం ఎస్సై అనిల్ కుమార్ దాడులు నిర్వహించినట్లు ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. పేకాడుతున్న 7మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి వద్ద నుండి 10240 నగదు 7 సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పేకాట ఆడడం వల్ల కష్టపడి సంపాదించిన సొమ్మును ఆటలో పోగొట్టుకుని, ఆర్థికం లేక కుటుంబాల్లో సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది ఆటగాళ్లు సాఫీగా సాగుతున్న వారి అమూల్యమైన దాంపత్య జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. పేకాట వదిలేసి వ్యవసాయ పనులు లేదా బ్రతుకు దెరువు కోసం మరేదైనా పనులు చేస్తూ కుటుంబాలను పరిరక్షించుకునే దిశగా ఆటగాళ్ళు పయనించాలని సూచించారు. పేకాట ఆడుతూ పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు. వారి వెంట తన సిబ్బంది ఉన్నారు.

## సీపీని కలిసిన హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి



హనుమకొండ, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): జనగామ డివిజనల్ ఏసీపీ విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బుధవారం హనుమకొండ డివిజనల్ ఏసీపీగా దేవేందర్ రెడ్డి భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

## ఈనెల 16న అఖిల పక్షాల భారత్ బంద్ విజయవంతం చేయాలి



భూపాలపల్లి, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్లో బుధవారం అఖిలపక్ష నేతలు సమావేశమైనారు. ఈ సందర్భంగా భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాశ్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ ఢిల్లీలో రైతులపై జరిగిన దాడి, మోడీ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టబోతున్న అఖిల పక్షాల భారత్ బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు చల్లూరి మధు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, జిల్లా అధికార ప్రతినిధి అజ్మీర జంపన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి సతీష్, సాంబమూర్తి, పుప్పాల రాజేందర్, సోతుకు ప్రవీణ్, కౌన్సిలర్లు ముంజల రవీందర్, అనిల్, నారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భువన సుందర్, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# గట్టమ్మ ఎదురుపిల్ల సమ్మేళనం


**- పాల్గొన్న తెలంగాణ మంత్రి సీతక్క**



ములుగు, ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త): ములుగు గట్టమ్మ దేవాలయం వద్ద ఆదివాసీ నాయకుపోడు సంఘం ఆధ్వర్యంలో బుధవారం గట్టమ్మ ఎదురుపిల్ల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హాజరైనారు. వారి వెంట మాజీ కేంద్ర మంత్రి, పోరిక బలరాం నాయక్, ఆదివాసి నాయకుపోడు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారి వీరభద్రం**



రాయపర్తి, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల పరిధిలోని గ్రామాల వారీగా రైతులందరూ పిఎం కిసాన్ ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మండల పరిధిలోని ఏఈఓలతో సమావేశమైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపర్తి మండలంలో సుమారు 590 మంది రైతులు ఈ కేవైసీ చేసుకోలేదన్నారు. ఈనెల 20వ తేదీ లోపు ఈ కేవైసీ చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏఈఓలు రైతుల వివరాలను ఈ కేవైసీ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ప్రధానమంత్రి కిసాన్ సంబంధించిన పథకానికి అర్హులైన రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. ప్రతీ ఒక్క రైతు ప్రతీ సీజన్ లో పంటల నమోదు కొరకు ఏఈఓలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈఓలు తదితరులు ఉన్నారు.

## భ్రమరాంబిక ఆలయంలో వసంత పంచమి వేడుకలు



ఐనవోలు, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలోని శ్రీ భ్రమరాంబికా అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు బుధవారం నిర్వహించారు. దేవాలయ కార్య నిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల మేరకు శ్రీ భ్రమరాంబిక దేవాలయ దశమ వార్షికోత్సవం స్వస్తిశ్రీ శోభకృత్ నామ సం: మాఘ శుక్ల పంచమి రోజున ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, అమ్మవారికి సుగంద పరిమళ ద్రవ్యములచే విశేష అభిషేకము నవకలశస్నపనము, నీరాజన మంత్రపుష్పములు చండీహవనము కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, వేదపండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జ్యోషీ, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎంపీడీవో బాధ్యతలు చేపట్టిన ఎం శంకర్



పర్వతగిరి, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండల కేంద్రంలో బుధవారం ఎం శంకర్ నూతన ఎంపీడీవో బాధ్యతలు చేపట్టారు. ఈ.ఓ.పి.ఆర్.డి అధికారిగా ఆయన గతంలో వర్ధన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసిన అనుభవాలు ఉన్నాయి. ఉన్నత పదవి బాధ్యతలు పొందిన తర్వాత వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటి సారిగా పలువురు భావిస్తున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

# ఇసుక తవ్వకాలతో ధ్వంసమౌతున్న వ్యవసాయ భూములు

**- పట్టించుకోని సంబంధిత అధికారులు**

వర్ధన్నపేట, ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారులోని అకేరువాగు పరిసర ప్రాంతంలో వ్యవసాయ భూములు ధ్వంసమౌతున్నాయి. తవ్వకాలు చేస్తున్న ఆ ప్రాంతంలో గ్రౌండ్ వాటర్ శాతం తగ్గిపోయి వ్యవసాయానికి ఆటంకం ఏర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా ఆకేరువాగులో తవ్వకాలు చేసిన కారణంగా సంవత్సరాలుగా ఇసుక కనిపించడం లేదు. దీంతో తవ్వకాలు చేయువారికి మరో అవకాశం లేకపోయింది. దీంతో ప్రక్కనే ఉన్న వ్యవసాయ భూములు తవ్వకాలు చేసిన మట్టిని మోటార్ల ద్వారా నీటితో శుభ్రం చేసి ఇసుకగా మార్చుతున్నారు. అలా మట్టిని ఇసుకాగా మార్చి వరంగల్ మహా నగరానికి తరలిస్తున్నారు. నాణ్యతలేని ఇసుక అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యవసాయ భూముల వద్ద నీటిపారుదల కోసం రైతులు మోటార్లు బిగించుకుని వ్యవసాయం చేస్తుండగా, ఇసుక అక్రమ తవ్వకాల వల్ల గుంతలు అధికంగా ఏర్పడి, వ్యవసాయ మోటర్లు కాలుపోయే పరిస్థితి ఏర్పడిందని బాధితుల మొర వినిపించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు. గతంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించున్నా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. రోజువారీగా జెసిబిలు పదుల సంఖ్యలో తవ్వుతూ వ్యవసాయ భూములను గుంతలుగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు నివారించాలని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ ఇటీవల ఆకేరువాగు పరిసర ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్న పలు జేసిబి మిషనరీలు, ఇసుక తరలిస్తున్న పలు ట్రాక్టర్లను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు చేయడం చట్టరీత్య నేరమని తవ్వకాల వారిని హెచ్చరించారు. ఐనప్పటికీ తవ్వకాల వ్యవహారం రోజురోజుకు మరింత పునరావృతం అవుతుందనే చెప్పవచ్చు. అందుకు నిదర్శనంగా మరో జెసిబి మిషనరీ సహాయంతో కొన్ని ట్రాక్టర్లతో తవ్వకాలు చేస్తూ ఇసుక తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూముల తవ్వకాలపై ఏమాత్రం పట్టింపు చేసే పరిస్థితి కరువైంది. గతంలో రెవెన్యూ కార్యాలయం ఆధీనంలో గ్రామీణ ప్రాంతాలవారీగా వీఆర్వోలు, వీఆర్ఏలు విధులు నిర్వహించేవారు. సమస్య ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో సమయం వృధా చేయకుండా తక్షణమే గ్రామస్థాయి అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యాత్మక పరిస్థితులను చక్కదిద్దేవారు. గత ప్రభుత్వం వారిని వివిధ శాఖలకు బదిలీ చేయడంతో రెవెన్యూ




కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. ఉన్నతాధికారులు మాత్రమే విధుల్లో ఉండడంతో ఫీల్డ్ వర్క్ చేయడానికి అవకాశం లేకపోయిందనే వాదన వినిపిస్తుంది. తక్కువ మంది అధికారులు ఉండడంతో కార్యాలయానికి పరిమితమయ్యారని ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. అక్రమ తవ్వకాలపై అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో కళ్ళముందే భూములు ధ్వంసమౌతున్నయని రైతన్నలు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ భూములను ధ్వంసం చేస్తూ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై సంబంధిత అధికారులు చట్టరీత్య చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఓటీటీలోకి వచ్చేసిన రొమాంటిక్ లవ్ స్టోరీ

అశోక్ సెల్వన్ హీరో గా నటించిన లేటెస్ట్ మూవీ సబా నాయగన్..ఈ మూవీలో కలర్ ఫోటో ఫేమ్ చాందిని చౌదరితో పాటు మేఘా ఆకాష్ మరియు కార్తిక మురళీధరన్ హీరోయిన్లు గా నటించారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ప్రభాస్ సలార్ కు పోటీగా డిసెంబర్‌లో 22 న థియేటర్ల లో రిలీజై మంచి వసూళ్లను రాబట్టింది.సబా నాయగన్ మూవీ వాలెంటైన్స్ డే కానుకగా బుధవారం ఓటీటీలో రిలీజైంది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ లో ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ మరియు హిందీ భాషల్లో ఈ సినిమా ను రిలీజ్ చేశారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ట్రెండింగ్ మూవీస్‌లో ఒకటిగా సబా నాయగన్ నిలిచింది.




## పాన్ ఇండియా రేంజ్‌లో
# ఇస్మార్ట్ శంకర్ పార్ట్ 2

మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ పూరి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్స్ సరసన నిలిచింది. అందుకే అప్పట్లోనే ఈ కు సీక్వెల్ ఉంటుందని ఎనౌన్స్ చేశారు. కాస్త ఆలస్యమైనా ప్రజెంట్ ఈ ను ఆడియన్స్ ముందుకు తీసుకువచ్చే పనిలో ఉంది పూరి టీమ్. డబుల్ ఇస్మార్ట్ షూటింగ్ స్టార్ట్ అయిన రోజే మార్చి 8న రిలీజ్ చేస్తున్నట్టుగా ఎనౌన్స్ చేశారు మేకర్స్. అంటే సరిగ్గా ఇంకో 30 రోజుల్లో ఈ ఆడియన్స్ ముందుకు రావాలి. అది కూడా పాన్ ఇండియా రేంజ్‌లో. లైగర్ తో నిరాశపరిచిన పూరి జగన్నాథ్ షార్ట్ గ్యాప్ తరువాత తన సూపర్ హిట్ కు సీక్వెల్‌ను పట్టాలెక్కించారు. రామ్ హీరోగా సూపర్ హిట్ ఇచ్చిన ఇస్మార్ట్ శంకర్‌కు పాన్ ఇండియా రేంజ్‌లో పార్ట్ 2ను ప్లాన్ చేస్తున్నారు. ఇప్పుడు అప్‌డేట్ విషయంలో మాత్రం సైలెంట్‌గా ఉన్నారు. లైగర్ తో తొలిసారి పాన్ ఇండియా అటెంప్ట్ చేసిన పూరి, ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయారు.దీంతో నెక్స్ట్ తో టార్గెట్ మిస్ కాకూడదని గట్టిగా ఫిక్స్ అయిన డాషింగ్ డైరెక్టర్... హిట్ ఫార్ములాకు సీక్వెల్‌ను పట్టాలెక్కించారు. రామ్, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో సూపర్ హిట్ అయిన ఇస్మార్ట్ శంకర్.మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ పూరి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్స్ సరసన నిలిచింది
. అందుకే అప్పట్లోనే ఈ కు సీక్వెల్ ఉంటుందని ఎనౌన్స్ చేశారు. కాస్త ఆలస్యమైనా ప్రజెంట్ ఈ ను ఆడియన్స్ ముందుకు తీసుకువచ్చే పనిలో ఉంది పూరి టీమ్.డబుల్ ఇస్మార్ట్ షూటింగ్ స్టార్ట్ అయిన రోజే మార్చి 8న రిలీజ్ చేస్తున్నట్టుగా ఎనౌన్స్ చేశారు మేకర్స్. అంటే సరిగ్గా ఇంకో 30 రోజుల్లో ఈ ఆడియన్స్ ముందుకు రావాలి. అది కూడా పాన్ ఇండియా రేంజ్‌లో. కానీ ఇంత వరకు ప్రమోషన్స్ మాత్రం స్టార్ట్ చేయలేదు టీమ్.



## ఓజీ మూవీలో భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉంది

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఓజీ'. సాహెూ దర్శకుడు సుజిత్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో చాలా కాలం తర్వాత పవన్ కల్యాణ్ గ్యాంగ్ స్టర్ పాత్రలో కనిపించనున్నాడు. అంతేకాదు ఈ మూవీ బ్యాక్డ్రాప్ మరియు నటీనటుల ఎంపిక వంటి చాలా విషయాలు ఎంతో ఇంట్రెస్టింగ్గా ఉన్నాయి. పవన్ కెరీర్లోనే 'ఓజి' మూవీ భారీ బడ్జెట్ తో తెరకెక్కుతుంది.అలాగే పాన్ ఇండియా మూవీగా వస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ రొమాంటిక్ హీరో ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే.సల్మాన్ ఖాన్ 'టైగర్ 3'లో విలన్ గా నటించి మెప్పించిన ఇమ్రాన్ ఇప్పుడు ఓజీలో నటిస్తుండటంతో సినిమాకు మరింత బజ్ క్రియేట్ అయ్యింది. అయితే తాజాగా అతడు ఓ బాలీవుడ్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ సందర్భంగా ఓజీ మూవీ షూటింగ్ విశేషాలను పంచుకున్నాడు. ఈ మేరకు ఇమ్రాన్ హష్మీ మాట్లాడుతూ.. ఓజీ మూవీలో భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉంది అంటూ ఈ సందర్భంగా సౌత్ ఫిలిం మేకర్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. బాలీవుడ్ తో పోలిస్తే దక్షిణాది దర్శక-నిర్మాతలు చాలా ముందున్నారని, వాళ్లు చాలా క్రమ శిక్షణతో పనిచేస్తారని అన్నారు.అందుకే సౌత్ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయంటూ దక్షిణాది మూవీ మేకర్స్ పై ఇమ్రాన్ ప్రశంసలు కురిపించాడు.ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. "బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ కంటే సౌత్ ఫిల్మ్ మేకర్స్ చాలా క్రమశిక్షణతో ఉంటారు. సినిమా కోసం వారు ఖర్చు చేసే ప్రతి రూపాయి తెరపై కనిపిస్తుంది. హిందీ సినిమాల్లో అలా కాదు. సినిమా కంటే కూడా నటీనటులకి ,ఇతర వాటికి ఎక్కువ ఖర్చు అవుతుంది. అలా సినిమాకు పెట్టే డబ్బు చాలా వృధా అవుతుందనేది నా అభిప్రాయం. అలాగే, వీఎఫ్ఎక్స్ వర్క్ తో పాటు పాత్ బ్రేకింగ్ కథల విషయానికి వస్తే.. దక్షిణాది చిత్రనిర్మాతలు బాలీవుడ్ కంటే ముందున్నారని చెప్పుకొచ్చారు.. ప్రస్తుతం ఇమ్రాన్ హష్మీ కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి.

## క్యూట్ ఫొటోలతో కేకపెట్టిస్తుంది

అదితి రావు హైదరి.. చెలియా తో హీరోయిన్ గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది ఈ అందాల భామ. ఆతర్వాత సమ్మోహనం తో సూపర్ హిట్ అందుకుంది. ఆతర్వాత వరుసగా లు చేసింది ఈ చిన్నది. అదితి రావు హైదరి.. చెలియా తో హీరోయిన్ గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది ఈ అందాల భామ. చూడ చక్కని రూపంతో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తమిళ్ లో పలు ల్లో నటించినప్పటికీ చెలియా తో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది అదితి రావు హైదరి. ఆతర్వాత ఇంద్రగంటి మోహన్ కృష్ణ దర్శకత్వం వహించిన సమ్మోహనం తో తెలుగులో సూపర్ హిట్ అందుకుంది. ఈ లో సుధీర్ బాబు హీరోగా నటించాడు. మొదటి అయినా తెలుగులో చక్కగా మాట్లాడి ప్రేక్షకులను ఆకట్టుకుంది అదితి. ఆతర్వాత వరుసగా లు చేసింది ఈ చిన్నది. సమ్మోహనం సూపర్ హిట్ అవ్వడంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ క్యూ కట్టాయి. వరుసగా వరుణ్ తేజ్ తో అంతరిక్షం, నాని , సుధీర్ బాబు మల్టీస్టారర్ వి, శర్వానంద్, సిద్దార్థ్ మల్టీస్టారర్ మహాసముద్రంలాంటి లు చేసింది కానీ మంచి హిట్ మాత్రం అందుకోలేకపోయింది అదితి రావు హైదరి. తమిళ్ లోనూ ఇప్పుడు ఈ చిన్నది పెద్దగా కనిపించడం లేదు'. అక్కడ హే సినామిక అనే లో నటించింది. ఈ లో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించాడు. అలాగే కాజల్ అగర్వాల్ మరో హీరోయిన్ గా నటించింది. ఇక సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్ గా అభిమానులతో టచ్ లో ఉంటుంది. సోషల్ మీడియాలో అదితి షేర్ చేసే ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది. చీరకట్టుతో పాటు



మోడ్రన్ డ్రస్సుల్లోనూ అదరగొడుతుంది ఈ అమ్మడు. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది అదితి రావు హైదరి. చీరకట్టులో ఈ అమ్మడి అందం మరింత ఎక్కువైంది అంటున్నారు ఫ్యాన్స్. ఈ ఫోటోలకు క్రేజీ కామెంట్స్ వస్తున్నాయి.

# జై హనుమాన్ హీరోగా కెజిఎఫ్ యష్?

ఈ ఏడాది సంక్రాంతికి విడుదలై భారీ విజయాన్ని అందుకున్న సినిమా హనుమాన్.. ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి బాక్సాఫీస్ ను షేక్ చేసింది.. తేజ సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ఈ సోషియో ఫాంటసీ సూపర్ హీరో చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతం చేసింది.. హనుమాన్ చిత్ర విజువల్స్ అబ్బురపరిచాయి. కేవలం రూ. 50 కోట్ల బడ్జెట్ లో ఇంత క్వాలిటీ విజువల్స్ ఏమిటని జనాలు నోరెళ్లబెట్టారు.. స్టార్ డైరెక్టర్స్ కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపించారు.. ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ ఒకటి సోషల్ మీడియాలో వినిపిస్తుంది. ఈ మూవీ వరల్డ్ వైడ్ రూ. 300 కోట్ల వసూళ్లు రాబట్టింది. తేజ సజ్జా వంటి ఒక యంగ్ హీరో చిత్రం ఈ స్థాయి వసూళ్లు సాధించడం ఊహించని పరిణామం. కేవలం కంటెంట్ ఆధారంగా హనుమాన్ భారీ వసూళ్లు రాబట్టింది. కాగా హనుమాన్ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని ప్రశాంత్ వర్మ ఇప్పటికే ప్రకటించాడు. జై హనుమాన్ టైటిల్ తో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుంది.. అయితే ఈ సినిమాలో హనుమాన్ హీరో గా కథ మొత్తం ఉంటుందని డైరెక్టర్ చెప్పారు.. ఇక ఆ పాత్ర కోసం ఒక స్టార్ హీరోను దించుతున్నట్లు చెబుతున్నారు.. హనుమాన్ లో ఫేస్ సరిగా రివీల్ చేయకపోయినప్పటికీ హనుమాన్ పాత్ర చేసింది రానా అని కథనాలు వెలువడ్డాయి. దీంతో జై హనుమాన్ హీరో రానా అని జనాలు ఫిక్స్ అయ్యారు. అయితే ఈ ప్రాజెక్ట్ హీరోగా యష్ ని తీసుకోవాలని అనుకుంటున్నారట%ా% భారీ బడ్జెట్ మూవీ కావడంతో యష్ ని లైన్లోకి తెస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.. కానీ ఈ వార్త మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతుంది%ా% త్వరలోనే దీనిపై ఒక క్లారిటీ రానుందని తెలుస్తుంది..






# విజయ్ దేవరకొండపై పీవీ సింధు ఇంట్రెస్టింగ్ కామెంట్స్.. అలా అనేసిందేటి?

విజయ్ దేవరకొండ సినిమాలపై భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. విజయ్ నటించిన సినిమాల్లో కొన్ని తనకు నచ్చలేదని చెప్పింది.
అయితే నచ్చని సినిమాలు ఏంటనేది మాత్రం రివీల్ చేయలేదు. తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సింధు ఈ వ్యాఖ్యలు చేసింది. అలాగే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అంటే తనకు క్రష్ అని మరోసారి వెల్లడించింది. అతని సినిమాలన్నీ చూశానని.. డైరెక్టగా కలిసే అవకాశం మాత్రం రాలేదని చెప్పింది.





'బ్యాడ్మింటన్ వల్ల ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి సినిమాలు చూస్తాను. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్‌ల యాక్టింగ్ నాకు చాలా ఇష్టం.విజయ్ దేవరకొండ సినిమాలు చూశాను కానీ కొన్ని నాకు అంతగా నచ్చలేదు. ఆ పేర్లు చెబితే కాంట్రవర్సీ అవుతుంది. నాకు నచ్చని సినిమాలు వేరే వాళ్లకు నచ్చొచ్చు. ఒక్కొక్కరి ఒక్కో అభిప్రాయం ఉంటుంది. ఏ హీరో అయినా సక్సెస్ అవుతుందనే నమ్మకంతోనే సినిమా చేస్తారు. వాళ్లపై కూడా ఒత్తిడి ఉంటుంది. సినిమా హిట్ అవుతుందో..ఫ్లాఫ్ అవుతుందో తెలియదు.కానీ నెలల తరబడి షూటింగ్ చేస్తారు. వాళ్ల కష్టాన్ని తక్కువ చేసి మాట్లాడకూడదు'అని సింధు చెప్పుకొచ్చింది. ఇకపోతే గతంలో సింధు సినిమాల్లోకి వస్తుందనే ప్రచారం జరిగింది. అయితే అందులో నిజం లేదని సింధు కొట్టిపారేసింది. నటించాలనే ఆలోచన తనకు లేదని.. ప్రస్తుతం తన ఫోకస్ అంతా ఆటపైనే ఉందని చెప్పింది. భవిష్యత్తులో సినిమాల విషయంలో తన నిర్ణయం ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేనని వెల్లడించింది. తన బయోపిక్ తీస్తే.. అందులో బ్యాడ్మింటన్ తెలిసిన దీపికా పదుకొణె లాంటి హీరోయిన్ నటిస్తే బాగుంటందని సింధు అభిప్రాయపడింది.



# దయచేసి రక్షణ కల్పించండి..

## పోలీసులను ఆశ్రయించిన హాట్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్

బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ గురించి రోజుకొక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. జాక్వెలిన్ ఫెర్నాండెజ్, సుఖేష్ చంద్రశేఖర్‌తో స్నేహం కారణంగా ఇబ్బందుల్లో పడింది.వందల కోట్ల రూపాయల మోసం కేసులో సుకేష్ జైలుకెళ్లిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కి లేఖలు రాస్తూ వస్తున్నాడు. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అతని ప్రవర్తనతో విసిగిపోయింది. దీంతో సుకేష్ చంద్రశేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను సుకేష్ బెదిరిస్తున్నాడని. కాబట్టి తనకు రక్షణ కల్పించాలని జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందించింది. జాక్వెలిన్ క్రైమ్ బ్రాంచ్ స్పెషల్ పోలీస్ కమిషనర్‌కు లేఖ కూడా రాసింది. తనకు భద్రత కావాలని.. సుఖేష్ నన్ను బెదిరిస్తున్నాడు. పోలీసులు ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కేసు దర్యాప్తునకు ఆదేశించినట్లు సమాచారంసుకేష్ చంద్రశేఖర్ నుంచి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ చాలా ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు ఆరోపణలువచ్చాయి.ఇద్దరూఒకరినొకరుప్రేవి ంచుకుంటున్నారని కూడా అంటున్నారు. అందుకు నిదర్శనంగా జాక్వెలిన్ ఫెర్నాండెజ్, సుఖేష్ చంద్రశేఖర్ సన్నిహితంగా ఉన్న ఫోటోలు వైరల్ అయ్యాయి. మనీలాండరింగ్ కేసు ఛార్జిషీటులో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ పేరు కూడా ఉంది.

# హీరోయిన్ తో పెళ్లి..

## ఎంత డబ్బు కావాలన్నా ఇస్తా

సోషల్ మీడియా వలన ఎన్ని లాభాలు ఉన్నాయో.. అంతకు మించిన నష్టాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా సెలబ్రిటీల గురించి రూమర్స్ అయితే మాములుగా ఉండవు.ఒక హీరో, హీరోయిన్ నవ్వుతూ ఒక ఫంక్షన్ లో కనిపించరు అంటే.. వారి మధ్య ప్రేమ ఉందని చెప్పుకొచ్చేస్తున్నారు. ఇక ఇద్దరు ఎయిర్ పోర్ట్ లో కనిపిస్తే వెకేషన్ కు వెళ్లినట్లు.. టెంపుల్ లో కనిపిస్తే త్వరలోనే పెళ్లి చేసుకుంటున్నారు అని రాసుకొచ్చేస్తున్నారు. ఇలా ఎంతోమంది జంటలు సోషల్ మీడియాలో వచ్చే రూమర్స్ కు బలి అవుతున్నారు. అయితే ఆ రూమర్స్ కు కొంతమంది చెక్ పెడతారు.. కొంతమంది లైట్ తీసుకుంటారు. అయిది ఇంకొంతమంది ఘాటుగా సమాధానం చెప్తారు.


తాజాగా మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ కూడా అలాగే ఇచ్చి పడేశాడు.

మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ గురించి తెలుగువారికి పరిచయం చేయాల్సిన అవసరం లేదు. తెలుగులో జనతా గ్యారేజ్, భాగమతి, యశోద వంటి సినిమాల్లో నటించి మెప్పించాడు. ఇక ఒక మైనర్ బాలికను అత్యాచారం చేశాడనే ఆరోపణలు ఎదురవడంతో అతనిపై కేసు నమోదు అవ్వడం, కోర్టులో కేసు నడుస్తూ ఉండడం వలన మరింత ఫేమస్ అయ్యాడు. ఇక గత కొన్ని రోజుల నుంచి ఉన్ని.. హీరోయిన్ మరియు క్యారెక్టర్ ఆరిస్ట్ అయిన అనుశ్రీ తో ప్రేమలో ఉన్నాడనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ మధ్య ఒక ఈవెంట్ లో వీరు జంటగా కనిపించడంతో.. వీరిద్దరూ





డేటింగ్ లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. ఇక ఈ వార్తలపై ఉన్ని ముకుందన్ ఘాటుగానే స్పందించాడు. ఈ న్యూస్ రాసిన **వ్యక్తిపై డైరెక్ట్ గా మండిపడ్డాడు. " ఇలాంటి ఫేక్ న్యూస్ ప్రచారం చేయకుండా ఆపడానికి నీకెంత డబ్బివ్వాలో చెప్పు.." అంటూ ఫైర్ అయ్యాడు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ గా మారింది.**



# ఫైటర్' వసూళ్లు...

## ఊహించలేదన్న హృతిక్ రోషన్

హృతిక్ రోషన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ రూపొందించిన చిత్రం 'ఫైటర్'. 'వార్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా కావడంతో ప్రేక్షకుల్ని ఆకర్షించింది.
రూ.250 కోట్ల భారీ బడ్జెట్‌తో దీనిని తెరకెక్కించారు. ఇది గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదలైంది. మొదటి రోజు రూ.24.60 కోట్లు (గ్రాస్) వసూలు చేసిన ఈ సినిమాకు మిశ్రమ స్పందన రావడంతో తొలినాళ్లలో బాక్సాఫీస్ వద్ద ఒడుదొడుకులు ఎదుర్కొంది. నెమ్మదిగా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని, ప్రస్తుతం మంచి వసూళ్లను రాబడుతోంది. ఇప్పటివరకూ రూ.337 కోట్ల వసూళ్లు రాబట్టిందని ట్రేడ్ వర్గాల సమాచారం. దీనిపై స్పందించిన హృతిక్ రోషన్ " ఇంత మంచి విజయం సాధి స్తుందని ఊహించలేదు. ఈ సినిమాలో భాగమైనందుకు గర్వంగా ఉంది" అని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు.హృతిక్ రోషన్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రల్లో 'ఫైటర్' తెరకెక్కింది. భారతీయ వైమానిక దళం నేపథ్యంలో సాగే యాక్షన్ చిత్రంగా దీనిని రూపొందించారు. పలువురు సినీ, క్రీడా ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. మరోవైపు హృతిక్ రోషన్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న 'వార్ 2'లో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.

# ఇలాంటి వార్తలను ప్రోత్సహించకండి



మహేశ్ బాబు హీరోగా దర్శకుడు త్రివిక్రమ్ తెరకెక్కించిన మూడో చిత్రం 'గుంటూరు కారం' . సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ఇటీవల ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' లోకి వచ్చింది. అందులోని పలు డైలాగ్స్, పాటల క్లిప్పింగ్స్‌ను అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఆనందిస్తున్నారు. మరోవైపు, కొన్ని సినీ వెబ్ పోర్టల్స్.. ఈ సినిమాలోని ఓ పాట కోసం చిత్రబృందం ముందుగా వ్యాఖ్యాత, నటి రష్మిని సంప్రదించిందని, ఆమె నటించేందుకు తిరస్కరించారని పోస్ట్‌లు పెట్టాయి. ఆ వార్తలపై రష్మిస్పందించారు. ఎక్స్ (ఇంతకుముందు ట్విటర్) వేదికగా వాటిని ఖండించారు. ఆ మూవీ టీమ్ అసలు తనను సంప్రదించలేదన్నారు. ఇలాంటి ఫేక్ న్యూస్ తనపై నెగిటివిటీని తీసుకొచ్చే అవకాశముందని, వాటిని ప్రోత్సహించవద్దని విజ్ఞప్తి చేశారు. సదరు పోర్టల్స్ చెప్పిన పాట మరేదో కాదు.. 'కుర్చీ మడతపెట్టి' ఈ ఎనర్జిటిక్ సాంగ్‌లో నటించిన పూర్ణను రష్మి ప్రశంసించారు. ఆమె తప్ప ఇంకెవరూ అంత బాగా చేయలేరని కితాబిచ్చారు. ఈ ప్రత్యేక గీతంలో 'రాజమండ్రి రాగ మంజరి..', 'ఏం రసిక రాజువో మరి' లైన్స్‌కు పూర్ణ, మిగిలిన పోర్షన్‌కు మహేశ్‌బాబు- శ్రీలీల డ్యాన్స్ చేసి ప్రేక్షకుల్ని అలరించారు. 'అతడు', 'ఖలేజా' తర్వాత మహేశ్- త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి, జయరామ్, రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. మహేశ్.. రమణ పాత్రలో అభిమానుల్ని అలరించారు.